


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -151-

**(18 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**పాట్నాకు** చెందిన డా.భగవాన్‌దాస్ ఆర్య అనే ప్రకృతి సిద్ధాంత వైద్యుడు ప్రపంచాన్ని క్షుద్బాధ నుంచి తప్పించే మహనీయుడు కావచ్చు. నలభై అయిదు వత్సరాల భగవాన్‌దాస్ ఆర్య ఆహార విషయంలో పరిశోధన చేసి నరుడు వాయు భక్షణ, జలభక్షణలతో హాయిగా, చక్కగా దుక్కగా జీవించగలడనే సత్యాన్ని అనుభవపూర్వకంగా ప్రకటించారు.

ఏమిటీ విచిత్రం అని అంటారేమో. ఆయన కుటుంబమంతా వరుసగా ఎనభై రెండు రోజులు కంచం వాల్చకుండా గాలిమేసి, నిప్పు రాజెయ్యకుండా నీళ్ళు త్రాగి బతికారట. అంటే ఈ ఆహారం కాని ఆహారం సేవించడం వల్ల మూల్గుతూ మంచం మీద పడివుండలేదట. మామూలుగా అన్ని పనులూ చూసుకుంటూనే వుండగలిగారట.

ఆఫీసుల్లో కుర్చీవదలని వారు గాని, కష్టించి పనిచేసే కార్మికులుగాని ఏ విధమైన ఆహారం ముట్టకుండా హాయిగా జీవించ వచ్చుట.

మారుమూల మనుష్యులేమిటి? వస్తాదులు కూడా జలభక్షణ, వాయుభక్షణలతో అంత శరీరం పెంచుకోవచ్చుట. కండరాలు దండిగా పెంచుకోవచ్చుట. మామూలు తిండి తినే వస్తాదుల్ని కూడా తిప్పి తిప్పి కొట్టవచ్చుట. ఎంత ఆశ్చర్యకరమైన వార్త.

పాముల్ని 'గాలి మేపదు' అంటారు. మత్స్యాల్ని 'జలజీవు'లంటారు. మానవులు కూడా గాలిమేపర్లు – జల భోజనులు కావడం ఎంతెంతో విచిత్రమైన వార్త. ఆర్యగారు ఈ విషయం బీహారు ఆహారశాఖవారికి తెలియచేశారుట. కావాలంటే నేను నిదర్శనాలు చూపిస్తానని.

ఇంత గొప్ప మార్పు, ఇంత గొప్ప పరిశోధన అమలులోకి రావడమంటే ప్రభుత్వానికి మాత్రం సంతోషకరంగా వుండదు. ఈ పద్ధతి అమలులోకి వస్తే దేశాన్ని ఆవరించిన సమస్యలెన్ని ముతాయి. "ఎంగిలి బెంగ తీరిపోతే ప్రజలు బంగారంలాగా జీవించరు?"

బీహారు ప్రభుత్వం త్వరలో ఈ సమస్యను పరిశీలించడానికొక కమిటీని వేస్తోందట. త్వరగా వారు పరిశీలించి ఆర్యగారి అభిప్రాయాన్ని అంగీకరిస్తే ఆహార సమస్యను తేల్చివేసినట్లే. ప్రభుత్వానికి, ప్రజలకు అంతులేని శ్రమ తగ్గించినట్లే.

జలభక్షణ, వాయు భక్షణ పద్ధతి అమలులోకి వస్తే ప్రభుత్వంలో ఎన్ని శాఖలు ఎగిరిపోతాయి? ఆహార మంత్రులు పోయి విహార మంత్రులు ఏర్పడతారు. వీరు దేశం వెంట తిరిగి "ప్రజలెంత ఉత్సాహవంతులుగా వుంటున్నారో మామూలు కార్యక్రమాలెలా జరుగుతున్నాయో. చిరునవ్వుల పంటలెలా పండుతున్నాయో చూసి ప్రభుత్వానికి రిపోర్టు చేస్తూ వుంటారు.

ఎంత చక్కటి మంత్రిత్వం? ఈ మార్పే సంభవిస్తే భువి, దివీ ఏకమైపోవు? గుండెలమీద బరువు తీసేసినట్లయి ప్రజలు కూనిరాగాలు తియ్యరా, కుప్పిగంతులు వెయ్యరా పూల బంతులు ఎగరవేసుకుంటూ వెర్రి నృత్యాలు చెయ్యరా.

ఆహార సమస్య లేకపోతే వ్యవసాయ రంగమే నిష్క్రమిస్తుంది. దాంతో ఫ్యాక్టరీలు పాడుకుంటాయి. గూడ్సు రైళ్ళ కూతలు తగ్గుతాయి. లారీలు రాళ్ళో రప్పలో మోస్తూ కూర్చుంటాయి. వ్యాపారం ముప్పాతిక తగ్గుతుంది. పోతే ఏ సబ్బు బిళ్ళలో, సాంబ్రాణీవత్తులో చిల్ల రంగులో నీళ్ళను శుభ్రం చేసే చిల్ల గింజలో ఇలాటివేవో అమ్ముతూ వుంటారేమో.

ఇళ్ళల్లో వంటిళ్ళు అదృశ్యమైపోతాయి. కుంపట్లు స్టవ్‌లు, గ్యాస్ పొయ్యిలు వగైరాలు అదృశ్యమైపోతాయి. స్త్రీలను కొందరు వంటింటి జీవులంటూ వుంటారు. ఆ కితాబు నశించిపోతుంది.

గాలి ముఖ్య ఆహారం గనుక అందరూ వరండాల్లో, వీధుల్లోనే వుంటారు. లేదా తోటల్లో పేటల్లో తిరుగుతూ వుంటారు. లేదా ఎక్కడ మంచిగాలి వుంటే అక్కడికి పరుగెత్తి చాలినంత గాలిమేసి చక్కా వస్తూ వుంటారు.

కాఫీ హోటళ్ళుపోయి గాలి హోటళ్ళు బయలుదేరతాయి. ఆకలయినప్పుడల్లా గాలి అవసరాన్ని కూడా ఆకలే అనాలిగా మరి. ఆ హోటల్‌కి వెళ్ళి ఒక రూపాయి గాలి అనో, అర్ధరూపాయి గాలి అనో అడిగి, అది స్వీకరించి చక్కా వస్తూ వుండాలి.

ఇప్పుడు ఇళ్ళదగ్గిర ఫలహారాలు వగైరాలు తయారు చేయించుకోవడానికి అవకాశాలు లేనివాళ్ళు, ఇళ్ళదగ్గిర పలుకుబడి లేనివాళ్ళు కాఫీ హోటల్‌కి వెళ్ళినట్లు ఆ రోజుల్లో కూడా తీరుబడిగా కూర్చుని గాలి పీల్చుకోవడానికి అవకాశాలు లేనివాళ్ళు మాత్రమే ఆ హోటళ్ళకు వెడుతూ వుంటారు.

గాలి పీల్చడమంటే అక్కడ వీలుండదు గనుక సైకిల్ టైర్లు వగైరాలకు గాలికొట్టినట్లే హోటళ్లలో కూడా మనుష్యులకు గాలికొట్టి మీటరు రేట్ల ప్రకారం సొమ్ము వసూలు చేస్తూ వుంటారేమో?

అయితే నీటి సమస్య మాత్రం చాలా క్లిష్టతరంగా మారవచ్చు. ఇప్పుడే నీటి ఎద్దడులు ఎక్కువగా వుంటున్నాయి. ఆ కాలంలో ప్రతివ్యక్తీ, రోజూ ఎన్ని గ్యాలన్ల నీరు త్రాగుతాడో తెలియదు గనుక నీటి ఖరీదు బాగా ఎక్కువైపోవచ్చు. హోటళ్ళలోకి వెళ్ళి మూడు లీటర్ల నీళ్ళు, నాలుగు పౌనుల గాలీ అని ఆర్డరివ్వవలసి రావచ్చు.

ఇళ్ళ కట్టడాలు వగైరాలు కూడా మారిపోతాయి. వంటిళ్ళకు బదులు వరండాలు వుంటాయి. పంపుల సంఖ్య ఎక్కువవుతుంది. ఇంకా హైక్లాస్ ఇళ్ళల్లో పడక గదుల్లో కూడా పంపులు ఏర్పాటు చేస్తారు. ఇళ్ళముందు గాలి పీల్చుకునేందుకు తోటలు వేయడం జరుగుతుంది.

అప్పుడు ఇళ్ళ అద్దెకు ఇచ్చేవారిలా ప్రకటనలు చేస్తారు. "నాలుగు వైపులనుంచి మంచిగాలి వచ్చే భవనం. నాలుగు పెద్ద గదులకూ నలభై కిటికీలు కలవు. ఇంట్లోనుంచి కదలకుండా కావలసినంత గాలిపీల్చవచ్చు. అవసరమైతే భవనం ముందు పెద్దతోట వుంది. అమితమైన గాలి సౌకర్యం.

భవనం మొత్తం మీద నలభై వరకూ పంపులున్నాయి. నీరు నిలువ చేసుకునేందుకు తెల్లగచ్చు ట్యాంకులున్నాయి. ఎక్కడివారు అక్కడే కూర్చుని నీరు త్రాగడానికి గొట్టాల ఏర్పాట్లున్నాయి. వివరాలకు ఈ క్రింది పోస్టు బాక్స్ నెంబరుకు వ్రాసి తెలుసుకోవచ్చు."

మరి చాలామంది మంచి దొడ్డీ, తోటా వున్న ఇల్లే చూసుకుంటారు. అతిధి మర్యాదలు కూడా చాలా మారిపోతాయి. ఎవరైనా బంధువు వచ్చినప్పుడు ఎంతసేపైనా శ్రమలేకుండా మాట్లాడవచ్చు. చివరకు కడుపునిండా చల్లటి మంచినీళ్ళు త్రాగించి, గాలి తినిపించడం కోసం తోటలోకి తీసుకుపోవచ్చు.

చెట్ల కింద అంతగా గాలి మెదలకపోతే, అతిధిని ఏ బాదం చెట్ల కొమ్మమీదనో ఎక్కించి, గృహస్తు ప్రక్క కొమ్మ మీద కూర్చుని, గాలి ఫలహారం చేయిస్తూ కబుర్లు చెప్పుకోవచ్చు. ఇందులో 'మారు'వద్దన్న మర్యాదలూ ఏమీ వుండవుగా.

అంతగా మర్యాద చేయాలని బుద్ధిపుడితే "ఇంకా కొంచెం గాలి భోంచెయ్యండి.. తొందరపడకండి. ముక్కుళ్ళు పెద్దవి చేసుకోండి. కొంచెం తల పైకెత్తండి. కాసేపు నేను పలకరించనులెండి. అదిగో గాలి తెరవస్తోంది. గట్టిగా పీల్చండి. పొట్టపట్టేంతవరకూ."

ఇలాంటి పద్ధతిలో కొన్ని మర్యాదలకు సంబంధించిన పదాలు వాడితే వాడవచ్చు . అతిధికి విందు చెయ్యాలంటే నీళ్ళసీసా ఒకటి చిన్నకారులో పెట్టుకుని ఏ విశాలమైన మైదానంలోకో తీసుకు వెళ్ళడం జరుగుతుంది.

ఇలాంటి సందర్భాలలో హోరు గాలిలో కూర్చోబెడితే "ఫీస్టు" అవుతుంది. పిల్లగాలుల్లో కూర్చోపెట్టి, కొంచెం గానాలు, గంతులూ తోడుచేస్తే "పిక్నిక్" అవుతుంది.

Post your comments